క్లుప్తంగా

మానవాళికి ప్రేమ, శాంతిని బోధించిన ఏసుక్రీస్తు



గుంటూరు ఎడ్యుకేషన్: భూమిపై మనిషిగా జన్మించిన ఏసుక్రీస్తు మానవాళికి ప్రేమ, శాంతిని బోధించారని జెడ్పీ చైపర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా పేర్కొన్నారు. జెడ్పీ ఆవరణలో బుధవారం రాత్రి 17వ సెమీ క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈసందర్భంగా హెనీ క్రిస్టినా మాట్లాడుతూ తోటివారిని ప్రేమించి, ఆదరించాలని యేసుక్రీస్తు బోధించారని, ఆయన బాటలో నడిచి శాంతి, సహనంతో మెలగాలని ఆకాంక్షించారు. రెవరెండ్ సి. వరప్రసాద్ మాట్లాడుతూ ప్రపంచంలోనే అత్యధికంగా ప్రజలు జరుపుకునే పండుగ క్రిస్మస్ అని, మంచికి, మానవత్వానికి క్రిస్మస్ ప్రతీక అని అన్నారు. ఈసందర్భంగా కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో హార్వెస్ట్ ఇండియా అధినేత కత్తెర సురేష్‌కుమార్, జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు,డిప్యూటీ సీఈవో సీహెచ్ కృష్ణ, పంచాయతీరాజ్ ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు రమేష్, బ్రహ్మయ్య, న్యూటన్ డానియల్, ప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

మందు బాబులపై కేసు

లక్ష్మీపురం: బహిరంగంగా మద్యం సేవిస్తూ దారి మార్గంలో కేకలు వేస్తూ వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్న నలుగురి పై పట్టాభిపురం పోలీసులు గురువారం సాయంత్రం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కానిస్టేబుల్ పి.శివనాగ రాజు, తులసీ నారాయణలిద్దరు పెట్రోలింగ్ విధులు నిర్వహిస్తున్నారు. పట్టాభిపురం డీఆర్ఎం కార్యాలయానికి వెళ్లే దారి మార్గంలో నలుగురు వ్యక్తులు సుభాని, శ్రీనివాసరావు, శ్రీనివాసులు, శివప్రసాద్ అనే వారు బహిరంగంగా మద్యం సేవించి గట్టి గట్టిగా కేకలు వేస్తూ దారి మార్గంలో ప్రయాణించే వాహనదారులను ఇబ్బందులకు గురి చేస్తున్నారు. దీన్ని గమనించిన పోలీసులు నలుగురిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

మాతృ మరణాలపై సమీక్ష

గుంటూరు మెడికల్: జిల్లాలో నవంబరులో జరిగిలో మూడు మాతృ మరణాలపై గురువారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సబ్ డిస్ట్రిక్ లెవల్ మాతృ మరణాల కమిటీ సమీక్ష సమావేశం జరిగింది. గుంటూరులో రెండు, తుళ్లూరు మండలంలో ఒక మాతృ మరణం సంభవించిందని డీఎంహెచ్‌ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి తెలిపారు. మూడు మాతృ మరణాల్లో అన్నీ కూడా నివారించలేనివని నిపుణులు నిర్ధారించినట్లు వెల్లడించారు. గర్భిణులు రక్తహీనత లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిపై ఉందన్నారు. గర్భం దాల్చిన మొదలు వైద్యుల సలహాలు తీసుకుంటూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చు అన్నారు. మాతృ మరణాలకు రక్తహీనత కూడా కారణమవుతోందని, దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ పని చేయాలన్నారు. సమీక్షలో డాక్టర్ అమర్తలూరి శ్రావణ్ బాబు, డాక్టర్ రత్న మన్మోహన్, డాక్టర్ మజీదాదీ, డాక్టర్ అరుణ, డాక్టర్ సుధీర్, డాక్టర్ ఆదిత్య ప్రదీప్, డాక్టర్ సునీత, డాక్టర్ బుచ్చిబాబు పాల్గొన్నారు.

హెల్మెట్ లేకుండా వాహనాలు నడపవద్దు



పట్నంబజారు: ప్రతి ఒక్క వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని గుంటూరు నగర ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ స్పష్టం చేశారు. గురువారం నగరంలోని ఎత్తురోడ్డు సెంటర్, మార్కెట్ సెంటర్‌తోపాటు పలు ప్రాంతాల్లో హెల్మెట్ ధారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాహనదారులను ఆపి హెల్మెట్ ధరించడం వల్ల ఉపయోగాలను వివరించారు. ట్రాఫిక్ డీఎస్పీ ఎం.రమేష్ మాట్లాడుతూ హెల్మెట్ అనేది ప్రమాద సమయంలో ప్రతి ఒక్క వాహనదారుడికి అస్త్రంలా ఉపయోగపడుతోందన్నారు. ఇటీవల జరిగిన పలు ప్రమాదాల్లో తలకు గాయాలు కావడం వల్ల మృతిచెందారన్న విషయాన్ని తెలిపారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలపై హైకోర్టు కూడా స్పందించి హెల్మెట్ ధారణ తప్పనిసరిగా ధరించాలని చెప్పిన నేపథ్యంలో ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా నడుచుకోవాలన్నారు. హెల్మెట్ లేకుండా వాహనాలు నడుపుతున్న 75 వాహనదారులకు జరిమానా విధించారు. హెల్మెట్ ధరించాలంటూ గులాబీ పూలు అందజేసి అవగాహన కల్పించారు. డీఎస్పీ రమేష్‌తో పాటు ఈస్ట్ ట్రాఫిక్ సీఐ ఎ.అశోక్, ఎస్సై రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలల్లో అవగాహన సదస్సు

నగరంలోని అమరావతి రోడ్డులో ఉన్న నారాయణ బాలుర కళాశాలలో వెస్ట్ ట్రాఫిక్ సీఐ సింగయ్య హెల్మెట్ ధారణపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం ప్రమాదానికి దూరం చేయడమేనన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నా రు. తలకు గాయాలు అవడం వల్లే అత్యధిక శాతం ద్విచక్ర వాహనదారులు మృత్యువాత పడుతున్నారన్నారు. విద్యార్థులు, యువత తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. సమావేశంలో ఎస్సై శ్రీహరి, కళాశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

అందం కాదు.. వ్యాపారమే ముఖ్యం

- గాంధీ పార్కులోనే క్యాంటిన్ ఏర్పాటుకు ఆదేశాలు
- కూటమి నేతల ఒత్తిళ్లకు తలొగ్గిన యంత్రాంగం



గాంధీ పార్కు ముఖద్వారం

నెహ్రూనగర్: గత వైఎస్సార్‌సీపీ పాలనలో వైసీపీ పాలకవర్గం హయంలో గుంటూరు నడిబొడ్డున శిథిలావస్థలో ఉన్న గాంధీ పార్కును అత్యంత సుందరంగా తీర్చిదిద్దిన సంగతి తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ గాంధీ పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో పాటు అందానికి మచ్చ తెచ్చే విధంగా కూటమి నేతలు పావులు కదుపుతున్నారు. తమ జేబులు నింపుకునే లక్ష్యంతో పార్కులో అడ్డదిడ్డంగా క్యాంటిన్ ఏర్పాటు చేసుకోని భారీగా లాభాలు పొందాలని చూస్తున్నారు కూటమి నేతలు.

కమిషనర్‌పై ఒత్తిడి

గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన కీర్తి చేకూరి గాంధీ పార్కులో క్యాంటిన్ ఏర్పాటు చేస్తే పార్కు అందం పోతుందని, దీని కోసం ప్రత్యేకంగా పార్కును అనుకుని ప్రత్యేకంగా స్థలం కేటాయించారు. సదరు స్థలంలోనే క్యాంటీన్‌ను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆ ప్రకారంగానే గాంధీ పార్కులో పనులు సాగాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, కమిషనర్ కీర్తి బదిలీపై వెళ్లడంతో కమిషనర్‌గా విధుల్లో చేరిన పులి శ్రీనివాసులపై కూటమి నేతలు ఒత్తిడి తీసుకువచ్చి క్యాంటిన్‌ను చివర కాకుండా మధ్యలో ఏర్పాటు చేసే విధంగా చూస్తున్నారు. దీని కోసం బుధవారం రాత్రి కూటమి నేతతో కలిసి గాంధీ పార్కును కమిషనర్ పరిశీలించారు. కూటమి నేతల ఒత్తిళ్లు తట్టుకోలేక క్యాంటిన్‌ను పార్కులోనే ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలని అధికారులను కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు.

దిగుమతి ఎగుమతుల్లో మంచి పేరు తీసుకొస్తాం

- ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్నా ఆంజనేయులు
- సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ కార్మికులకు యూనిఫాం పంపిణీ



నూతన యూనిఫామ్‌ను పంపిణీ చేస్తున్న గంగాధర్

లక్ష్మీపురం: ప్రజా పంపిణీ వ్యవస్థలో కీలక బాధ్యతలు నిర్వహిస్తూ పేద ప్రజలకు ప్రభుత్వం ఇచ్చే నిత్యావసర సరుకులను కార్మికులు సకాలంలో ఎగుమతి, దిగుమతి పనులు నిర్వహించి రాష్ట్రంలోనే జిల్లా కి మంచి పేరు తీసుకు రావడం జరుగుతుందని రాష్ట్ర సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ(ముఠా)వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చిన్నా ఆంజనేయులు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో జిల్లాలో పనిచేస్తున్న ముఠా కార్మికులకు యూనిఫాం పంపిణీ కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న ముఠా కార్మికులకు 2024 దసరా సందర్భంగా ఇచ్చే మూడు జతల యూనిఫామ్‌ను జిల్లా పౌరసరఫరాల సంస్థ అసిస్టెంట్ మేనేజర్ గంగాధర్ రావు చేతుల మీదుగా అందుకోవడం చాలా సంతోషదాయకంగా ఉందన్నారు. పేద ప్రజల కోసం నిత్యవసర వస్తువులను పంపిణీ సకాలంలో పనులు నిర్వహిస్తున్న ఈ కార్మిక వర్గంపై రాష్ట్ర ప్రభుత్వం 12 నెలలు గడుస్తున్నప్పటికీ పెంచిన కూలీ రెట్ల జీవోను విడుదల చేయకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.సురేష్ బాబు మాట్లాడుతూ నిత్యవసర సరుకులను ప్రజలకు సకాలంలో అందేలా కష్టపడుతున్న సివిల్ సప్లయిస్ కార్మికులకు ప్రభుత్వం సివిల్ సప్లయిస్ యాజమాన్యం నుంచి రావలసిన సౌకర్యాలను త్వరితగతిన అందేలా ఉన్నతాధికారుల చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర ఉపప్రధానకార్యదర్శి రావుల అంజిబాబు, జిల్లా అధ్యక్షులు కోట్ల మరియదాసు, ముఠామేస్త్రిలు నాగేశ్వరరావు, బాబురావు, కోటేశ్వరరావు, తాడిబోయిన రమేష్ , రామారావు,శీను, దానం, నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైడ్ ఎఫెక్ట్‌లేని శారీరక చికిత్స ఫిజియోథెరపీ

అవగాహన సంస్థ ఆరోగ్య సభలో డాక్టర్ వి.సుజాత



లక్ష్మీపురం: మానసికంగా శారీరకంగా కృంగిపోయే రోగుల వికాసానికి సంజీవిని వలె ఫిజియోథెరపీ ఏవిధమైన సైడ్ ఎఫెక్ట్ లేని శారీరక వైద్యమని సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వి.సుజాత అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో గురువారం సంస్థ కార్యదర్శి కొండాశివ రామిరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. అనంతరం పలు ఆరోగ్య సూత్రాలను వివరించారు. సంస్థ సభ్యులు డాక్టర్ వి.సుజాతను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంస్థ సభ్యులు సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

పెనుగొండకు అవగాహన అభినందనలు

లక్ష్మీపురం: అవగాహన సంస్థ ఏర్పడిన నాటి నుంచి సంస్థ సభ్యుడిగా సంస్థ కార్యక్రమాల నిర్వహణలో ప్రముఖ పాత్ర వహిస్తున్న అభ్యుదయ రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం ప్రకటించడం పట్ల అవగాహన సంస్థ అభినందలు తెలుపుతుందని సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి అన్నారు. 2024 సంవత్సరానికి లక్ష్మీనారాయణ రచించిన దీపిక అనే సాహిత్య విమర్శనా సంపుటికి ఈ పురస్కారం ఇవ్వాలని కేంద్ర సాహిత్య అకాడమీ ప్రకటించడం అవగాహన సంస్థ ప్రశంసిస్తుందన్నారు. సాహితీ కొండగా ప్రసిద్ధి చెందిన పెనుగొండ 50 సంవత్సరాల సాహితీ ప్రస్థానంలో ఎన్నో మైలు రాళ్ళ అధిగమించారన్నారు. ఎన్నో పురస్కారాలను, సత్కారాలను పొందారని చాలా చిన్నస్థాయి నుంచి కష్టపడి స్వశక్తితో ఎదిగి అభ్యుద రచయితల సంఘం జాతీయ అధ్యక్షుడిగా ఎన్నికయ్యారన్నారు.

జిల్లా రచయితల సంఘం...

నగరంపాలెం: అరసం జాతీయ అధ్యక్షుడు పెనుగొండ లక్ష్మీనారాయణకు కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు ప్రకటించడంపై జిల్లా రచయితల సంఘం అధ్యక్షురాలు సి.భవానిదేవి, ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం. సుభాని గురువారం ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆయన రచించిన వ్యాస సంపుటి 'దీపిక'కు ఈ పురస్కారం లభించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. భవిష్యత్‌లో మరెన్నో పురస్కారాలు అందుకోవాలని వారు అకాక్షించారు.

ముత్యాలరెడ్డి నగర్‌లో యువతి అదృశ్యం

లక్ష్మీపురం: ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేసిన ఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముత్యాలరెడ్డి నగర్ 2వ లైన్ ప్రాంతానికి చెందిన యువతి హైదరాబాద్‌లోని ఫ్యాషన్ కోర్సు చేస్తుంది. నవంబర్ 27వ తేదీన హైదరాబాద్ నుంచి గుంటూరుకు వచ్చి ఇంటి వద్దనే ఉంటుంది. అయితే బుధవారం సాయంత్రం 6 గంటలకు ఇంటి వద్ద నుంచి బయటకు వెళ్ళి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు చుట్టుపక్కల పరిశీలించి, ఎంతకూ జాడ తెలియలేదు. దీంతో గురువారం సాయంత్రం అరండల్‌పేట పోలీసులకు ఫిర్యా దు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థి దశలో నిర్ణయాలే భవిష్యత్‌ని నిర్దేశించేది

–భాష్యం రామకృష్ణ



గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థి దశలో నిర్ణయాలే భవిష్యత్తును నిర్దేశిస్తాయని భాష్యం విద్యాసంస్థ చైర్మన్ భాష్యం రామకృష్ణ అన్నారు. గురువారం గోరంట్లలోని భాష్యం టెన్త్ విద్యార్థుల క్యాంపస్‌లో మోటివేషనల్ సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధమవుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. క్రమశిక్షణ, పట్టుదల ఉంటే ఎంతటి సవాలునైనా సులువగా అధిగమించవచ్చునని, జీవితంలో ఎన్నో సవాళ్లతో కూడుకుని ఉంటుందన్నారు. ఎదురయ్యే ప్రతి పరిస్థితిని సమయస్ఫూర్తితో అధిగమిస్తూ, అనుకున్న లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. విద్యార్థి దశలో ఏకాగ్రతను సడలించే ఎన్నో పరిస్థితులు ఎదురవుతాయని, వాటిని ఎదుర్కొని నిలబడినప్పుడే జీవితంలో ఉన్నత శిఖరాలనే అధిరోహిస్తారని చెప్పారు. రాబోవు టెన్త్ పబ్లిక్ పరీక్షలు జీవితంలో ఎంతో కీలకమని, విద్యార్థులందరూ పరీక్షలు చక్కగా రాయాలని అన్నారు. కార్యక్రమంలో భాష్యం ముఖ్య సలహాదారుడు మైకేల్‌రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమిత్‌షా వ్యాఖ్యలపై నిరసనలు



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న మాజీ శాసన సభ్యుడు మస్తాన్‌వలి

లక్ష్మీపురం: పార్లమెంట్‌లో కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలకా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక లాడ్జి సెంటర్‌లోని బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అమిత్ షాకు వ్యతిరేకంగా జిల్లా కాంగ్రెస్‌పార్టీ నేతృత్వంలో గురువారం సాయంత్రం కొవ్వుతులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం కొవ్వుతులతో నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి గడ్డం పాల్ విజయ్ కుమార్, మదన్ మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆఫీస్ ఇంచార్జి బిళ్ళాసునిల్, వెస్ట్ ఇంచార్జి రాచకొండ జాన్ బాబు తదితరులు పాల్గొని నిరసన వ్యక్తం చేశారు.

కేవీపీఎస్ దళిత ప్రజా సంఘాలు..

లక్ష్మీపురం: పార్లమెంట్ సాక్షిగా కేంద్ర హోం మంత్రి అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ను అవమాన పరుస్తూ మాట్లాడడాన్ని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్), దళిత, ప్రజా సంఘాలు తీవ్రంగా ఖండించింది. అమీత్ షా వెంటనే క్షమాపణలు చెప్పాలని నాయకులు నగర నాయకులు జి.లూథర్ పాల్, బి.ముత్యాలరావు డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం గుంటూరు లాడ్జి సెంటర్ లో అంబేద్కర్ విగ్రహం వద్ద అమీత్ షా వ్యాఖ్యలకు నిరసన తెలియజేశారు. కార్యక్రమంలో దళిత,ప్రజా సంఘాల నాయకులు సముద్రాల చిన కోటేశ్వరరావు, ఎ.కళ్యాణి, వేము భగవాన్ దాస్, గండికోట శంకర్రావు, బుజ్జి కె. నళినీకాంత్, షేక్ ఖాసిం వలి, పూనేపల్లి శ్రీనివాసరావు, షేక్ ఖాసిం షహీద్, కిషోర్, జి శ్రీనివాసరావు, వల్లెపు గణేష్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

మోదీ క్షమాపణ చెప్పాలి

లక్ష్మీపురం: రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ అవమానించిన అమిత్ షా ని మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని తక్షణమే దేశ ప్రధాని నరేంద్ర మోదీ భారత జాతికి క్షమాపణ చెప్పాలని కాంగ్రెస్ పార్టీ తూర్పు నియోజక వర్గ మాజీ శాసన సభ్యుడు మస్తాన్ వలి డిమాండ్ చేశారు. స్థానిక ఆనంద్‌పేటలోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహం వద్ద మాజీ శాసన సభ్యులు మస్తాన్ వలి ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొని నినాదాలు చేశారు.

సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో..

లక్ష్మీపురం: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ పై పార్లమెంటు సాక్షిగా అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్రమంత్రి అమిత్ షాను మంత్రి వర్గం నుంచి తక్షణమే తొలగించాలని సీపీఎం పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బి.లక్ష్మణరావు, ఆది నికల్సన్, సుందరయ్య నగర్ శాఖ కార్యదర్శి జి లూథర్ పాల్ డిమాండ్ చేశారు. 41వ డివిజన్లలోని స్థానిక సుందరయ్య నగర్ నందు గురువారం పార్లమెంట్‌లో అమీత్‌షా వ్యాఖ్యలు ఖండిస్తూ నిరసన కార్యక్రమం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు షేక్ మస్తాన్‌వలి, ఆంజనేయులు, పద్మ, నూర్జహాన్, సుకన్య, బేబీ పాల్గొన్నారు.

ఏసుక్రీస్తు జీవితం ఆదర్శనీయం



గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గల్లా మాధవి, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి, డెప్యూటీ మేయర్ సజిల, నగరపాలక సంస్థ అధికారులు పాల్గొన్నారు.

నెహ్రూనగర్: ఏసుక్రీస్తు జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు అన్నారు. గురువారం రాత్రి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధ్యక్షత సెమిక్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. మేయర్ మాట్లాడుతూ ఏసుక్రిస్తు చూపిన బాట నేటి తరం ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ప్రతి ఏటా నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో క్రిస్మస్, రంజాన్, సంక్రాంతి, బక్రీదు పండుగులు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం క్రిస్మస్ కేకట్ చేశారు.

ఆటపాటలతో కూడిన విద్య అందించాలి

పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి

గుంటూరు ఎడ్యుకేషన్: మూడేళ్ల నుంచి ఐదేళ్ల వయసు గల పిల్లలకు ఆటపాటలతో కూడిన విద్య అందించాలని పాఠశాల విద్య ఆర్జేడీ బి. లింగేశ్వరరెడ్డి పేర్కొన్నారు. చౌత్రా సెంటర్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఫౌండేషన్ లిటరసీ, న్యూమరసీ కార్యక్రమంలో భాగంగా ప్రాథమికస్థాయి ఉపాధ్యాయులతో పాటు, అంగన్‌వాడీ ఉపాధ్యాయులకు జ్ఞానజ్యోతి శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. మూడు రోజులపాటు జరగనున్న శిక్షణా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్జేడీ మాట్లాడుతూ జాతీయ విద్యా విధానంలో చోటు చేసుకున్న మార్పులకు అనుగుణంగా సమగ్రాభివృద్ధిని అందించడమే లక్ష్యంగా విద్యాబోధన జరగాలన్నారు. అంగన్‌వాడీస్థాయి నుంచే పునాది వేయాలని సూచించారు. సమగ్రశిక్ష ఏపీసీ జి. విజయలక్ష్మి మాట్లాడుతూ శిక్షణా కార్యక్రమంలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో పాఠశాలల్లోని విద్యార్థులకు బోధించాలని సూచించారు. కాలానుగుణంగా విద్యాబోధన అందించాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు అబ్దుల్ ఖుద్దూస్, జ్యోతికిరణ్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎండీ ఖాసిం, సమగ్రశిక్ష సీఎంవో అనిల్, పరిశీలకుడు సూరిబాబు, డీఆర్పీలు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీరామకోటి మహోత్సవాలు



మాట్లాడుతున్న వెంకటలీలాసుందరి



విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న దృశ్యం

నగరంపాలెం: స్థానిక సంపత్‌నగర్ శ్రీరామనామక్షేత్రంలో 98వ శ్రీరామ కోటి మహోత్సవాల్లో భాగంగా గురువారం సమిష్టి పారాయణం, ప్రసన్నంజనేయ స్వామికి విశేష సహస్ర నాగవల్లీ దళార్చన నిర్వహించారు. శ్రీ మాన్ కోగంటి వెంకటలక్ష్మీ అప్పలాచార్యుల శ్రీకృష్ణలీలామృతం, తురగ శ్రీకృష్ణ చైతన్య (హైదరాబా ద్) వారి భక్తిరంజని, ముప్పవరపు వెంకటసింహాచలశాస్త్రిచే ఏర్పాటు చేసిన భక్త మార్కండేయ హరికథ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనంతరం గీత మందిరంలో ఆర్ఎంసీల ఆత్మీయ సమావేశం జరగ్గా, నిర్వాహకురాలు రాగం వెంకట లీలాసుందరి మాట్లాడుతూ తరతరాలుగా ఆర్‌ఎంసీలు చేస్తున్న సేవలు అభినందనీయమన్నారు. ఉత్సవాల్లో సేవలందిస్తున్న ఆర్ఎంసీలను సత్కరించగా, భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాద వితరణ నిర్వహించారు. రామాయణ, భగవద్గీత, చిత్రలేఖన, భక్తి పాటల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కాగా ఉత్సవాల్లో భాగంగా శ్రీఆంజనేయస్వామి తిరువీధి ఉత్సవం కోవెలమాడ వీధులలో మేళతాళాలతో వైభవంగా జరిగింది. కార్యక్రమంలో శ్రీశృంగేరి పీఠ పాలిత శ్రీసీతారామ సంకీర్తన సంఘం, శ్రీరామనామక్షేత్రం గుంటూరు కార్య నిర్వాహకులు రాగం వెంకటలీలాసుందరి, మస్తాన్‌రావు దంపతులు, పోలిశెట్టి హరిప్రసాదరావు, క్షేత్ర పాలక మండలి సభ్యులు, బెల్లంకొండ మస్తాన్‌రావు, బసవరాజు జయశంకర్, పాతకోటి బ్రాహ్మణయ్య నాయుడు, పబ్బిశెట్టి బాబురావు, కొత్తూరి రామ్మోహనరావు, కొప్పరావూరి సుబ్బారావు, పబ్బిశెట్టి రామకృష్ణ, డాక్టర్ మన్నవ రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఉపాధ్యాయులపై ఒత్తిడి తగ్గించాలి



సమావేశంలో రాజశేఖర్‌రావు, కళాధర్, నాయకులు

యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్

గుంటూరు ఎడ్యుకేషన్: పాఠశాలల్లో ఏ చిన్న తప్పిదం జరిగినా ఉపాధ్యాయులను బాధ్యులుగా చేస్తున్న ప్రభుత్వం వారిని విపరీతమైన ఒత్తిడికి గురి చేస్తోందని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని సంఘ జిల్లా కార్యాలయంలో గురువారం జరిగిన సమావేశంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. చిత్తూరుజిల్లా పూతలపట్టు పరిధిలోని తలుపులపల్లి హైస్కూల్లో పని చేస్తున్న బయాలాజికల్ సైన్స్ ఉపాధ్యాయుడు సిద్దయ్యశెట్టి ఎస్ఏ-1 ప్రశ్నపత్రాలు తీసుకుని వస్తూ, రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటనకు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఆయనకు నివాళులు అర్పించారు. ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని, ఏ చిన్న లోపం తలెత్తినా ఉపాధ్యాయులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడాన్ని మానుకోవాలని డిమాండ్ చేశారు. ఒక సంఘటన మరచిపోకముందే మరో సంఘటన చోటు చేసుకుని, ఉపాధ్యాయులు బలై పోవడం తీవ్ర ఆవేదనకు గురి చేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా కమిటీ సభ్యులు ఎండీ షకీలాబేగం, ఉదయభాస్కర్, పాణిరెడ్డి, నయీమ్, కొండపల్లి వెంకటేశ్వరరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

యోగాసన స్పోర్ట్ చాంపియన్‌షిప్‌లో విజయలక్ష్మికి స్వర్ణపతకం



నగరంపాలెం: ఐదో సీనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన గోలి విజయలక్ష్మి స్వర్ణపతకం సాధించింది. కర్ణాటకలోని తుమకూరులోని మహాత్మాగాంధీ స్టేడియంలో ఈనెల 12–15వ తేదీ వరకు ఐదో సీనియర్ నేషనల్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించారు. సీనియర్ మహిళల విభాగంలో(45–55 ఏళ్లు) ఆమె స్వర్ణపతకం సాధించారు. విజయలక్ష్మి యోగాను అభ్యసించడం, రాష్ట్రంలోని యోగ నిపుణుల నుంచి మార్గనిర్దేశం పొందడం గెలుపునకు ప్రత్యేకంగా నిలుస్తోంది. అమరావతి యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో గెలిచి జాతీయస్థాయి పోటీలకు అర్హత సాధించారు. గుంటూరులోని వైఎంకే యోగా సెంటర్‌లో తన నైపుణ్యాలను మెరుగుపరుచుకుంటూ ఈ జాతీయ స్థాయి ఛాంపియన్‌షిప్‌కి సిద్ధమయ్యారు. గోలి విజయలక్ష్మిని ఆంధ్రప్రదేశ్ యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ (వైఎస్ఏపి) అధ్యక్షురాలు డాక్టర్ ఎ.రాధిక, ప్రధాన కార్యదర్శి ప్రేమ్‌కుమార్ అభినందించారు. విజయలక్ష్మి భర్త మల్లేశ్వరరావు వైద్యునిగా గుర్తింపు పొందారు.

శ్రీపూజిత స్కూల్లో ఉత్సాహంగా ఎల్లో కలర్ డే



ఎల్లో కలర్ డేలో చిన్నారులతో ప్రిన్సిపాల్ పద్మావతి, ఉపాధ్యాయులు

గుంటూరు ఎడ్యుకేషన్: పట్టాభిపురంలోని శ్రీపూజిత స్కూల్లో గురువారం ఎల్లో కలర్ డే నిర్వహించారు. ఈసందర్భంగా చిన్నారులు వివిధ రకాల ఆకృతులతో పసుపు రంగు వస్త్రాలు ధరించి ఆకట్టుకున్నారు. తరగతి గదులను పసుపు రంగు బెలూన్లు, పేపర్ కటింగ్స్‌తో అలంకరించారు. పాఠశాల ప్రిన్సిపాల్ కంచర్ల పద్మావతి మాట్లాడుతూ పసుపు రంగు స్పష్టత, సూర్యకాంతి, వ్యక్తిగత శక్తికి, పరిపూర్ణతకు, ధైర్యానికి, ఆత్మ విశ్వాసానికి ప్రతీక అన్నారు. చిన్నారులకు వివిధ రంగుల ప్రాముఖ్యతను తెలియ చేప్పేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని తెలిపారు. ఈ సందర్భంగా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ చిన్నారులు వివిధ రకాల పండ్లు, ఆకుకూరలు, పూలు ఆకృతులు కలిగిన దుస్తులను ధరించి, ర్యాంప్ వాక్ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయండి

జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ పిలుపు



లక్ష్మీపురం: దేశవ్యాప్తంగా అమిత్ షా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పై చేసినటువంటి అనుచిత వ్యాఖ్యల్ని సీపీఐ తరుపున ఖండిస్తున్నామని జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక కొత్తపేటలోని సీపీఐ కార్యాలయం మల్లయ్య లింగం భవన్ లో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అమిత్‌షా పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, స్పీకర్, కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐఆవిర్భావించి 100 సంవత్సరాలు ఈనెల 26 నాటికి పూర్తవుతున్న సందర్భంగా వాడ వాడల నిర్వహించనున్నామన్నారు. ఈ శత వార్షికోత్సవాలు 26 నుండి 30వ తేదీ వరకు జిల్లాలో ఉన్నటువంటి అన్ని నియోజకవర్గాల్లో ప్రదర్శనలు, సమావేశాలు నిర్వహిస్తున్నామన్నారు.

హామీలను నెరవేర్చాలి...

చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు అర్హులైన పేదలకు గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు నివాస స్థలాలు ఇచ్చి, ఇల్లు కట్టుకోవడానికి నాలుగు లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కూటమీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఆరు నెలలు పూర్తయి ఏడో నెల జరుగుతున్నా ఇచ్చిన హామీపై ఎటువంటి ప్రస్తావన లేకపోవడం బాధా కరమన్నారు. అలగే విద్యుత్ చార్జీలను వెంటనే ఉపసంహరించాలని లేకపోతే గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బషీర్ బాగ్ విద్యుత్ ఉద్యమం ఎలాగైతే చేసా మో, అలాంటి ఉద్యమాన్ని తిరిగి చెప్పడతామని హెచ్చరించారు.